క్లుప్తంగా

నేడు పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఖమ్మంలో పర్యటించనున్నారని ఆయన క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కూసుమంచి మండలం నాయకన్‌గూడెం చేరుకున్న ఆయన సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని డీసీసీ కార్యాలయాన్ని సందర్శించనున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ బాధ్యులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్ హసన్, ఆర్‌వీఎస్.సాగర్ బుధవారం కలెక్టరేట్‌లో కలిశారు. ఈసందర్భంగా పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి శిథిలావస్థలో ఉన్న ఖమ్మం రూరల్ టీఎన్జీవోస్ తాలుకా యూనిట్ కార్యాలయ భవన పునర్నిర్మాణానికి రూ.10లక్షలు ప్రకటించగా.. అందుకు సంబంధించిన లేఖను కలెక్టర్‌కు అందజేశారు. నాయకులు నందగిరి శ్రీను, జీఎస్.ప్రసాదరావు, వెంకటరెడ్డి, లవణ్, రామకృష్ణ, వై.శ్రీనివాసరావు, పురుషోత్తంరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాకు తరలిరండి

ఖమ్మం సహకారనగర్: కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం(నేడు) హైదరాబాద్‌లోని సర్వశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టరేట్‌ను ముట్టడి చేయనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ. నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధికా సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

30న 'వురిమళ్ల' పురస్కారాల ప్రదానోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: వురిమళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల 30వ తేదీన ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపులోని మంచికంటి భవన్‌లో పురస్కార ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు వురిమళ్ల సునంద, బోగోజు ఉపేందర్‌రావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వురిమళ్ల ఫౌండేషన్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కథలు, కవితలకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. కవులు, రచయితలు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

నేలకొండపల్లి: రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని కూసుమంచి ఏడీఏ ఎస్.విజయచంద్ర సూచించారు. బుధవారం మండలంలోని రాజేశ్వరపురంలో రైతుల పొలాలను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువులను రైతులు వినియోగించాలని, వకినారు తీయడానికి వారం రోజుల ముందు 3జీ గుళికలు వేసుకోవాలని సూచించారు. అనంతరం పత్తి పంటలను సందర్శించి మొలక శాతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నిఖిల, పలువురు రైతులు పాల్గొన్నారు.

'రాయల' పరామర్శ

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు బుధవారం పర్యటించారు. అమ్మగూడెంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ గండు జానయ్య, మోటాపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న బొల్లినేని వెంకటేశ్వరరావులను పరామర్శించారు. అనంతరం నేలకొండపల్లిలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, చిట్యాల రమేష్ పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	114	బచ్చలికూర	4
వంకాయ	20		10
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	90		10
కాకర	50	చుక్కకూర	3
సొరకాయ	20		10
బీర	50	తోటకూర	4
దొండ	16		10
పొట్లకాయ	46	గోంగూర	2
చిక్కుడు	60		10
గోరుచిక్కుడు	36	మెంతికూర	4
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	50	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		30
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	56		20
క్యాప్సికం	96	-ఖమ్మం గాంధీచౌక్	

శిథిల భవనాల తొలగింపు

- కేఎంసీలో ఎమర్జెన్సీ కంట్రోల్ రూం ఏర్పాటు
- నీరు నిల్వకుండా తగు చర్యలు
- అప్రమత్తమైన డీఆర్ఎఫ్ సిబ్బంది
- కేఎంసీ అధికారులతో సమీక్షించిన కమిషనర్ ఆదర్శ్ సురభి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో శిథిలావస్థ భవనాలను గుర్తించి వాటిని వెంటనే తొలగించే పనులను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాకాలంలో శిథిలావస్థలకు చేరుకున్న భవనాలతో మరింత ప్రమాదం పొంచి ఉన్నందున అధికారులు అప్రమత్తమై నగరాన్ని జల్లెడ పడుతున్నారు. తద్వారా గుర్తించిన భవనాలను తొలగించే పనులు చేపట్టనున్నారు. అంతేకాక నగర ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా కేఎంసీ కార్మికులకు అవగాహన కల్పించడంతో పాటు అమలు చేసేలా చర్యలు చేపట్టారు. కార్మికులతో పాటే కాకుండా వారానికో రోజు చొప్పున నగర ప్రజలంతా వారివారి ఇళ్లల్లో డ్రైడే కార్యక్రమాలు చేపట్టేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

కేఎంసీ అధికారులతో సమీక్ష..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలపై శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ఇతర విభాగాల అధికారులతో కమిషనర్ ఆదర్శ్ సురభి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో శిథిలావస్థ భవనాలు, గోడలను గుర్తించే పనులను వేగవంతం చేసి వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల వలన కలిగే ప్రమాదాలు, ప్రజలకు ఏర్పడే ఇబ్బందుల పట్ల యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండి వాటిని నివారించాలన్నారు. శిథిలావస్థకు చేరిన నిర్మాణాలు, వాటి గోడలపై ఏళ్ల క్రితం నాటి చెట్లు పెరిగి, ఎండిపోయి ఉంటే వాటిని గుర్తించి తొలగించాలన్నారు. డీఆర్ఎఫ్ సిబ్బంది అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

వర్షాకాలం సీజన్‌లో కేఎంసీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఎమర్జెన్సీ కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో ఎక్కడా వర్షాలతో సమస్య తలెత్తినా ఈ కంట్రోల్ రూం నుంచి అన్ని విభాగాలను అప్రమత్తం చేసి, అక్కడకు చేరవేసేందుకు సమన్వయం చేయాలని పేర్కొన్నారు. నగరంతో పాటు విలీన పంచాయతీల్లో, నగర శివారుల్లో నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు చేపట్టేలా అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.మల్లీశ్వరి, ఎంఈ కృష్ణాలాల్, డీఈలు రంగారావు, ధరణి, స్వరూపరాణి, నవ్యజ్యోతి, డీసీపీ వికాస్ తదితరులు పాల్గొన్నారు.



నీరు నిల్వ ఉండొద్దు...

నిల్వ నీటిని డ్రెయినేజీల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూడడంతో పాటు నగరంలో అన్ని మ్యాన్ హోల్స్ మూసి ఉంచాలి. డ్రెయినేజీల్లో సిల్ట్ పెరుకుపోయి ఉంటే కేఎంసీ కార్మికుల చేత తొలగించాలని, మురుగు రోడ్లపైకి పారకుండా ఎప్పటికప్పుడు డ్రెయిన్లను శుభ్రం చేయించాలి. తాగు నీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా చూసి మురుగు నీరు ఆ పైపుల్లోకి చేరకుండా పగడ్బందీ చర్యలు తీసుకోవాలి.
– కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

రైతులందరికీ పాస్ పుస్తకాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

కూసుమంచి: సాగు భూములు కలిగిన ప్రతీ రైతుకు పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని, ధరణి సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో నిర్వహించిన రైతుసంఘం రాజకీయ శిక్షణ తరగతుల ముగింపులో భాగంగా ఆయన మాట్లాడారు. రైతాంగ సమస్యలపై దశలవారీ పోరాటాలకు సిద్ధం కావాలని రైతులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 2020లో 9.5లక్షల మంది రైతుల నుంచి సాదాబైనమా దరఖాస్తులను స్వీకరించి నేటికీ పాస్ పుస్తకాలు మంజూరు చేయలేదని తెలిపారు. వెంటనే దరఖాస్తులు పరిశీలించి, ధరణ సమస్యలు తొలగించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూనిర్వాసితుల పక్షాన నిలిచి వారికి న్యాయమైన పరిహారం దక్కేలా పోరాడతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, ఉపాధ్యక్షులు బండి రమేష్, రచ్చా నర్సింహారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, జిల్లా నాయకులు మల్లెల సన్మంతరావు, ఎడవెల్లి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ భవనాలుగా రైతు వేదికలు'

రఘునాథపాలెం: రైతు వేదికలను బీఆర్ఎస్ భవనాలుగా మార్చారని టీపీసీసీ సభ్యుడు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రమైన రఘునాథపాలెం రైతు వేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసుకునేందకు అనుమతి ఇవ్వకుండా తాళం వేశారని ఆరోపిస్తూ.. అక్కడే ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయంపై మేళకువలు కల్పించేందుకు, రైతులు సమస్యలను అధికారులు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికలు బీఆర్ఎస్ భవనాలుగా మారాయన్నారు. 24 గంటలు కరెంట్ ఇచ్చామని గొప్పలు చెబుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కడ ఇచ్చారో చూపించాలని సవాల్ విసిరారు. రైతులకు అండగా కాంగ్రెస్ నిలిస్తే.. బీఆర్ఎస్ నమ్మిస్తూ మోసం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, బాలాజీ, కొంటెముక్కుల నాగేశ్వరరావు, కోటేరు నర్సిరెడ్డి, మారం కరుణాకర్‌రెడ్డి, దారావత్ రామూర్తి, సర్పంచ్ బాతులు రమణసుధాకర్, రెంటాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సత్యనారాయణరెడ్డికి 'లయన్స్' అవార్డు



అవార్డు అందుకుంటున్న సత్యనారాయణరెడ్డి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంకు చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ కె.సత్యనారాయణరెడ్డికి ఇంటర్నేషనల్ అవార్డు లభించింది. ఈమేరకు డిస్ట్రిక్ట్ చైర్మన్ సత్యనారాయణరెడ్డికి గ్లోబల్ యాక్షన్ టీం హానర్స్ ఇంటర్నేషనల్‌ప్రెసిడెంట్ బ్రియాన్ షీహన్ ఇటీవల అవార్డు ప్రకటించారు. నల్లగొండలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయనకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు జగిని బీమయ్య, తీగల మోహన్‌రావు అవార్డు అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా డాక్టర్ రాఘవరెడ్డి, మురళీధర్‌రావు, రఘుపతి, డాక్టర్ మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మదన్‌మోహన్ తదితరులు సత్యనారాయణరెడ్డిని అభినందించారు.

'తమ్మినేని' సంతాపం

తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌సాయిపేట మాజీ సర్పంచ్, సీపీఎం సీనియర్ నాయకుడు భూక్యా వెంకన్న మాతృమూర్తి భూక్యా సాలీ మృతి చెందారు. ఈమేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, వైఎస్సార్‌టీపీ నాయకుడు నంధ్యాల రవీందర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్, షేక్ బషీరుద్దీన్, శ్రీను, మహేందర్, పుసులూరి వీరభద్రం, ఆనందరావు, వీరభద్రం, మట్ట కృష్ణారావు, వెంకటాచారి, బాలు, వెంకన్న, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆలయ కల్యాణ మండపం పనులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని బాలాజీనగర్‌లో శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణమండపం పనులు శరవేగంగా సాగుతున్నాయి. బుధవారం మండపం నిర్మాణ దాత బాలాజీ ఎస్టేట్స్ ఎండీ వత్సవాయి రవి శ్లాబు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, దేవాలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు, చైర్మన్ మేకల వీరన్న, ప్రధాన కార్యదర్శి గుగులోత్ మణికంఠ, గౌరవ అధ్యక్షుడు జెల్లికొండలరావు, పురం తిరుపయ్య, గుడిమల్ల నాగేశ్వరరావు, బొల్లి కొమరయ్య, సత్యం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మం సహకారనగర్: ఆలిండియా హ్యాండ్ రైటింగ్, కాలిగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యాన ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాండ్‌రైటింగ్ పోటీల్లో తమ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిభ కనబర్చారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం పాఠశాలలో వారు విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించి వివరాలు వెల్లడించారు.

వసతిగృహాల్లో మౌలిక వసతులు కరువు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ పేర్కొన్నారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల్లో సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల భవనాల మరమ్మతు చేయించకపోగా, విద్యార్థులకు నోట్‌బుక్స్, దుస్తులు, బెడ్ షీట్లు అందించలేదన్నారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు యువరాజు, శివ, సతీష్, బిట్టు, వెంకటేష్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు 'అల్లిక' సాయం



తిరుమలాయపాలెంలో తాగునీటి కుళాయిలు అందిస్తున్న అల్లిక వెంకటేశ్వరరావు

తిరుమలాయపాలెం: మండలంలోని పలు పాఠశాలలకు తాగునీరు, మరుగు దొడ్ల మరమ్మతులకు అవసరమైన నగదు, వస్తువులను బీఎస్పీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు బుధవారం అందజేశారు. మండలంలోని తిరుమలాయపాలెం ప్రాథమిక పాఠశాలకు మంచినీరు అందించే వస్తువులు, ఎదుళ్లచెరువు, బలరాంతండాలలోని పాఠశాలల్లో మరుగుదొడ్ల డోర్ల రిపేరకు అయ్యే నగదు, స్కావెంజర్‌ను ఏర్పాటు చేసి ప్రతి నెలా రూ.వెయ్యి జీతాన్ని అందించేలా కృషి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్ని కష్టాలు ఎదురైన చదువును విస్మరించొద్దని సూచించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ పీ.సీ. వీరస్వామి, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌యాదవ్, మండల అధ్యక్షుడు బిక్కునాయక్, నాయకులు శ్రీను, కొమ్ము వీరబాబు, గొడుగు వెంకన్న, హెచ్ఎంలు రవికుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాలకు బుధవారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కుమార్తె దీప్తి ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా ఆయా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంగీలాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, ఉపాధ్యక్షులు ఆర్మి రవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబానికి..



ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన టూ వీలర్ మెకానిక్ వేణుహుస్సేన్ కుటుంబానికి టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యాన బుధవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఆ నగదును యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మాట్లాడుతూ..జిల్లాలోని మెకానిక్‌లు లారీ, బస్సు, కారు, ఆటో, ఫౌండ్రీలలో పనిచేస్తున్న వారందరినీ చేతివృత్తిదారులుగా గుర్తించి రూ.లక్ష రుణాన్ని అందించాలని కోరారు. అలీపాషా, శ్రీను, రమేష్, మురళి, గంగరాజు, నాగేశ్వరరావు, రవి, శేషు, వెంకట్, రామకష్ణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేగులచలక పంచాయతీలో ఆఫర్..

ఇంటి పన్ను కడితే.. డస్ట్ బిన్లు ఉచితం

రఘునాథపాలెం: ఇంటిపన్ను కట్టి తడి, పొడి చెత్త డబ్బాలను తీసుకెళ్లాలంటూ మండలంలోని రేగులచలక పంచాయతీ సరికొత్త ఆఫర్ ప్రకటించి పంచాయతీలో ప్రచారం చేపట్టారు. ఈమేరకు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటి పన్ను కట్టిన వారికి నేడు (గురువారం) ఉదయం 8 గంటల నుంచి డస్ట్‌బిన్లు పంపిణీ చేయనున్నారు. గృహ యజమానులు గత సంవత్సరం ఇంటి పన్ను చెల్లించిన రశీదును చూపించి డస్ట్‌బిన్లు పొందాలని కోరారు.

సమస్యలకు నిలయాలుగా పాఠశాలలు



ఇందిరానగర్ పాఠశాలలో తిరుగుతున్న పశువులు

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నట్లు చెబుతున్నా ఆచరణలో విఫలమవుతున్నారని పీడీఎస్‌యూ ఖమ్మం డివిజన్ కార్యదర్శి లక్ష్మణ్ విమర్శించారు. నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోగా, విద్యార్థులు పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడంతో బోధన సాగడంలేదన్నారు. కాగా, ఇందిరానగర్ పాఠశాల ఆవరణలోకి కుక్కలు, పశువులు వస్తున్నా ఎవరూ స్పందించడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర కార్యదర్శి కరణ్‌తో పాటు రవి, శివ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు..



స్వీపర్లకు సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే స్వీపర్ల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని ఆరోపించారు. మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న స్వీపర్లకు బుధవారం సంఘీభావం ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.పార్ట్ టైమ్ స్వీపర్లుగా కాకుండా.. ఫుల్‌టైమ్ స్వీపర్లుగా గుర్తించి నెలకు రూ. 27 వేల వేతనాలు ఇవ్వాలని, లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు యడవల్లి నాగరాజు, చిట్యాల రమేష్, దనవత్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి



రఘునాథపాలెం: సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌రెడ్డి

రఘునాథపాలెం: గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందు రోడ్డులోని గణేష్ గార్డెన్‌లో మండల గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘ జేఏసీ ఆధ్వర్యాన అఖిలపక్ష పార్టీలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. సీపీఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి ఆవుల మంగతాయి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దీప్లా, బీఎస్పీ నాయకులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. సీపీఐ కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, మున్సిపల్ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా వెంకటేశ్వర్లు, సీతామహాలక్ష్మి, జి.రామయ్య, పిట్టల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జీపీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి..

కూసుమంచి: గత కొన్నిరోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెను ప్రభుత్వం వెంటనే విరమింపజేయాలని టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం కూసుమంచిలో సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ.హఫీజుద్దీన్, ఎడవెల్లి రాంరెడ్డి, జెర్రిపోతుల అంజనీ, బచ్చలికూర నాగరాజు,బెల్లం కొండ కిరణ్, కొండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని వినతి

జీపీ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కార్మికుల తరఫున బుధవారం జేఏసీ ఆధ్వర్యాన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వెంకన్న, సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆవుల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల మధ్య ఉద్రిక్తత..

నేలకొండపల్లి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కార్మికులు గత మూడు రోజులుగా సమ్మెలోకి రాకుండా.. విధులు నిర్వహిస్తున్నారు. కాగా, బుధవారం తెల్లవారుజామున విధుల్లోకి వెళ్లిన విషయం తెలుసుకున్న పంచాయతీ కార్మిక సంఘం నాయకులు వారి వద్దకు వెళ్లి పనులు చేయడానికి వీలులేదని పంచాయతీ ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. దీంతో ఇరువురు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. కార్మికుల అందరి ప్రయోజనాల కోసమే సమ్మె చేస్తున్నామని తమకు సహకరించాలని వేడుకున్నారు. దీంతో సమ్మెలో పాల్గొనేందుకు నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కార్మికులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు వంగూరి నాగరాజు, రహీముతుల్లా, ఆంజనేయులు, గోపయ్య, వెంకటేశ్వర్లు, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

ముసురుకుంది..!

జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డా.. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజలు ముసురుకి తడవకుండా పలు జాగ్రత్తలు పడ్డారు. వర్షం రాకతో గొడుగులు, రెయిన్ కోట్లకు గిరాకీ పెరిగింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఖమ్మం



మయూరిసెంటర్‌లో గొడుగు, చీరకొంగుల రక్షణతో వెళ్తున్న మహిళలు



వర్షంలో వెళ్తున్న వృద్ధులు



రెయిన్ కోట్లు కొనుగోలు



గొడుగుల కొనుగోళ్లు ఇలా..